క్లుప్తంగా

సీపీని కలిసిన ఏసీపీలు



సీపీ రంగనాథ్‌తో ఏసీపీలు

వరంగల్ క్రైం: కాజీపేట, పరకాల, మామునూరు ఏసీపీలుగా నియమితులైన పి.డేవిడ్‌రాజు, కే.కిశోర్‌కుమార్, సీ.సతీష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన సతీష్‌బాబు

మామునూరు: మామునూరు పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీగా సీ.సతీష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఏసీపీ కృపాకర్.. చీఫ్ ఆఫీస్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన సతీష్‌బాబును మామునూరు, వర్ధన్నపేట ఇన్‌స్పెక్టర్లు క్రాంతికుమార్, శ్రీనివాస్, ఎస్సై కృష్ణవేణి, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ఇన్‌స్పెక్టర్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: డివిజన్లలోని ప్రతీ కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య కోరారు. నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఒకటవ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తోట నాగరాజు, నంది శ్రీనివాస్, కత్తెరశాల ప్రశాంత్, మూల దేవేందర్, శంకర్, సదానందం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

‘శ్వేతార్క’లో అలారం సిస్టం



అలారం సిస్టంను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నూతన అలారం సిస్టాన్ని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి సహకారంతో ఆలయంలో ఏర్పాటు చేసిన అలారం గంటకొకసారి గంటలు కొట్టడంతో పాటు ప్రతీ గంటకు ఒక భగవద్గీత శ్లోకం చదివి దాన్ని అర్థాన్ని వివరిస్తుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విభూది అలంకరణలో అయ్యప్ప



కాజీపేట: అధిక శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మొదటి బుధవారం కాజీపేట పట్టణంలోని అయ్యప్ప స్వామిని అర్చకులు విభూదితో అలంకరించి అభిషేకం చేశారు. హరిహర పుత్రుడిని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఉడుతల శ్రీనివాస్ శర్మ భక్తులతో కలిసి విభూదితో అభిషేకం జరిపించారు. పూజా కార్యక్రమాల్లో గురుస్వాములు బుర్ర జనార్దన్ గౌడ్, ఆవాల పురుషోత్తం రెడ్డి, అరూరి సాంబయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాజీపేటలో పీరీలకు ప్రార్థనలు



కాజీపేట: త్యాగం, వీరత్వానికి ప్రతీకైన మొహర్రం సందర్భంగా కాజీపేట పట్టణంలో పీరీలను బుధవారం ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 10 రోజుల పాటు వరుసగా ప్రత్యేక ప్రార్థనలతో పాటు పుర వీధుల్లో ఊరేగింపులు నిర్వహించడం ఆనవాయితీ. ముతవలి అమ్మూబాయ్ ఆధ్వర్యంలో పతర్ గటి, ఇమామ్ ఖాసి, హాసన్ హుస్సేన్, షేక్ అలీ అబ్బాస్ పీర్లను ఏర్పాటు చేశారు. పదోరోజు పీరీలను నిమజ్జనం చేస్తారు. ఈనెల 28న మొహర్రం వేడుకలను పట్టణంలో నిర్వహించనున్నట్లు అమ్మూబాయ్ తెలిపారు.

కార్పొరేషన్ స్థలం నిరుపయోగం

- ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని స్థానికుల వేడుకోలు

కాజీపేట: ప్రజా ప్రయోజనాలకో, అధికారుల కార్యకలాపాలకో వినియోగపడాల్సిన నగర పాలక సంస్థకు చెందిన స్థలం పుష్కరకాలంగా కాజీపేట పట్టణంలో నిరుపయోగంగా ఉంది. 62వ డివిజన్ పరిధిలోని కాజీపేట చౌరస్తాకు కూతవేటు దూరంలో నగరపాలక సంస్థకు దాదాపు రూ.రెండు కోట్లకు పైగా విలువైన స్థలం ఉంది. అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ విలువైన ప్రభుత్వ స్థలం డంపింగ్‌యార్డుగా మారింది. పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. దానికితోడు చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది అక్కడే పడేస్తున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డాగా..

పొదలతో నిండిన ఈ ఖాళీ స్థలం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వరకు ఇక్కడే ఉంటూ మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

ప్రజల డిమాండ్ ఇలా..

గత కొంతకాలంగా ఈ స్థలాన్ని పట్టణ గ్రంథాలయ భవన నిర్మాణం లేదా ఏసీపీ, తహసీల్దార్, ఎక్సైజ్ కార్యాలయాలకు కేటాయించాలనే డిమాండ్ ఉంది.



కాజీపేట చౌరస్తాలోని మున్సిపల్ స్థలం

గతంలో గ్రంథాలయం ఏర్పాటుకు..

నిరుపయోగంగా ఉన్న ఈస్థలాన్ని అభివృద్ధి చేసి గ్రంథాలయ భవన నిమిత్తం వాడుకోవడానికి అనుమతి కోరుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాయిని రాజేందర్‌రెడ్డి ప్రతిపాదనలు తయారు చేయించి జిల్లా అధికారుల ద్వారా స్థలం మార్పిడికి అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఆ కాగితాలు నేటికీ సీఎం పేషీలో మూలకు పడి ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి రాగానే ఈ స్థలంలో రూ.50 లక్షల వ్యయంతో మోడల్ గ్రంథాలయ భవనం నిర్మించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన ప్రతిపాదన కాగితాలకే పరిమితం అయ్యాయి.

ఇరుకు గదుల్లో గ్రంథాలయం

మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో అద్దె భవనంలో చాలీచాలని గదుల్లో ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే భవనం నిర్మించుకునే అవకాశం ఉన్నందున స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ దృష్టిని సారించి వృథాగా ఉన్న ఆ స్థలాన్ని గ్రంథాలయ సంస్థకు లేదా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు కేటాయించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



కాజీపేట పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేకుండానే కొనసాగుతున్నాయి. జిల్లా అధికారులతో చర్చించి శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– సుంచు వేణుకుమార్, సోమిడి

సమాజ మార్గనిర్దేశకులుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రం

కేయూ క్యాంపస్: విద్యార్థులు శాస్త్రీయ ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకొని సామాజికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ సమాజ మార్గనిర్దేశకులుగా ఎదగాలని కాకతీయ యూనివర్సిటీ సీడీసీ డీన్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ రాంచంద్రం ఆకాంక్షించారు. కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం ‘ఫస్ట్ ఇయర్ విద్యార్థుల వెల్‌కమ్’ ‘సెకండ్ ఇయర్ విద్యార్థుల ఫేర్ వెల్ డే’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో జరుగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను శాస్త్రీయంగా అంచనా వేయడంలో విశ్వవిద్యాలయాల విద్యార్థులు ముందుండాలని సూచించారు. కులం, మతం, స్త్రీ, పురుష వివక్ష, అసమానతలు లేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవలసిన బాధ్యత నేటి విద్యార్థి లోకం పైనే ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు కృష్ణ, వెంకట్, సత్యనారాయణ, నాగరాజు, పరిశోధక విద్యార్థులు నరసింహారావు, మాదాసి రమేష్, తాళ్లపల్లి నరేష్, గుండేటి సుమన్, సురేష్, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై జాగ్రత్త



రైతులకు పాకెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కరీమాబాద్: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్ అన్నారు. మామునూరు పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీకేలో పాడి పశువుల యాజమాన్యంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన దూడలకు మొదటి అరగంటలో జున్ను పాలు తాగిస్తే వాటిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. దూడల పోషణ, పునరుత్పత్తి, యాజమాన్యం గురించి తెలిపారు. డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ పాడి పశువుల్లో డీవార్మింగ్, టీకాల గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. అనంతరం రైతులకు ఖనిజ లవణ మిశ్రమ పాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ గణేష్‌తోపాటు పాడి రైతులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

మడికొండ: ఉన్నత కళాశాలలో సీటు సంపాదించి విద్యనభ్యసిస్తున్న గురుకుల విద్యార్థులకు గురుకులాల సొసైటీ నగదు బహుమతి అందజేసింది. ఎన్ఐటీ తాడేపల్లిగూడెంలో సీటు సాధించిన విద్యార్థులు ఎస్.రుతుజ, భవాని, దీపికకు ఒక్కొక్కరికి రూ.40వేల చొప్పున నగదు బహుమతిని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ తరఫున పంపించగా, హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా వారికి అందజేశారు. అలాగే, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు దీవెన, శ్రావణి, అభినయశ్రీ, శృతి, హర్షిత, అర్చనకు ఒక్కొక్కరికి రూ. 25వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న వినీల

హన్మకొండ చౌరస్తా: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ లీగల్ కౌన్సిలర్ వినీల సూచించారు. హనుమకొండ కిషన్‌పురలోని మాస్టర్‌జీ గర్ల్స్ హైస్కూల్‌లో మహిళలు, బాలికలకు హక్కులు, న్యాయసేవా అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ మహిళలు, బాలికలు సమస్యలపై ఫిర్యాదు, న్యాయ సలహాల కోసం 0870 – 2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో సఖి సెంటర్ కేస్ వర్కర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

కెనడా పార్లమెంట్ సభ్యుడిని కలిసిన ఈవీ.శ్రీనివాస్



హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన కెనడా మిస్సిసాగా మాల్టన్ ప్రావిన్షియల్ పార్లమెంట్ సభ్యుడు దీపక్ ఆనంద్, ఆయన కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలక వర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని శ్రీనివాస్ బహూకరించారు.

చైతన్య వర్సిటీ సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఉప కులపతి దామోదర్, ప్రొఫెసర్లు

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఎంబీఏ రెండవ సెమిస్టర్, బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ నాలుగవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు యూనివర్సిటీలో సెమిస్టర్ ఫలితాలను ఉప కులపతి ప్రొఫెసర్ జీ.దామోదర్ బుధవారం విడుదల చేశారు. ఎంబీఏ రెండవ సెమిస్టర్ పరీక్షల్లో 84.44 శాతం ఉత్తీర్ణత, బీటెక్, బీఫార్మసీ నాలుగవ సెమిస్టర్‌లో 62.34 శాతం, ఎంటెక్ (సీఎస్‌సీ) నాలుగవ సెమిస్టర్‌లో 100 శాతం ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవీందర్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ జీ.శంకర్ లింగం, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ వీ.మల్లికార్జున్, ఓఎస్‌డీ డాక్టర్ కే.వీర వెంకటయ్య, అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఎస్.కవిత, అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.సుమ, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య వేదిక బుద్ధభవన్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: పేద ప్రజలు విద్య, సామాజిక రంగాల్లో రాణించేందుకు బుద్ధభవన్ గొప్ప చైతన్య వేదికగా నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ కుమార్‌పల్లిలోని బుద్ధభవన్ ఆవరణలో బుధవారం భవన పునఃనిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. వచ్చేనెల (ఆగస్టు) 18వ తేదీన బుద్ధభవన్ పునఃనిర్మాణ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై బుద్ధభవన్ వ్యవస్థాపకుడు బీఆర్ భగవాన్‌దాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుమారు ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడి ప్రజలు స్వయంకృషితో నిర్మించుకున్న బుద్ధభవన్, పునఃనిర్మాణంలో ప్రభుత్వం తరఫున భాగస్వామ్యం కల్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక హంగులతో బుద్ధుడి సన్నిధిలో ప్రశాంతత చేకూరేలా భవన నిర్మాణం జరిగేలా కృషి చేస్తామన్నారు. భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బుద్ధభవన్‌తో పాటు స్థానికంగా యూత్ భవన్ పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు కేటాయిస్తానని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుద్ధభవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కార్యదర్శి వంగల సుదర్శన్, బుద్ధభవన్ పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు బీఆర్ లెనిన్, కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, ముఖ్య సలహాదారులు అంకేసరపు సారయ్య, కన్వీనర్ కునమల్ల జితేందర్, సభ్యులు గొర్రె రవీందర్, యాళ్ల సంజయ్‌కుమార్, బూజుగుండ్ల అరుణోదయ, టీఆర్‌ఎస్ నాయకులు నలుబోలు సతీశ్, సిద్దంశెట్టి శ్రీనివాస్, చింతాకుల ప్రభాకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి: పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్ ఉందని, తమ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థి ఉపాధి పొందేలా తర్ఫీదు ఇచ్చి, ప్లేస్‌మెంట్‌తో పంపుతామని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తామని చెప్పారు. సీటు రాని విద్యార్థులు నిరాశకు గురికాకుండా తమ కార్యాలయంలో సంప్రదిస్తే స్పాట్‌లో అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏకే.రాథోడ్, డాక్టర్ ఈవీ.రావు, డాక్టర్ రఘు, పలు విభాగాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: ఆరోగ్యవంతమైన తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆరుగురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు బుధవారం వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, దేవస్థాన మాజీ ధర్మకర్త కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్, జాగృతి నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన హసన్‌పర్తికి చెందిన మేకల రాజేందర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గరిగె కుమారస్వామిని పరామర్శించారు.

సంక్షిప్తంగా

దర్గాలో వీధికుక్కల భయం

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ దర్గాలో వీధి కుక్కల స్వైర విహారంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల దాడుల వరుస ఘటనలతో బయటికి రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. దర్గా గాంధీ సెంటర్ సమీపంలో పద్మ అనే మహిళపై ఓ కుక్క బుధవారం దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చికిత్స కోసం ఆమెను కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల దర్గా అంబేడ్కర్‌నగర్‌లో ఉప్పలయ్య అనే వ్యక్తిపై కుక్కలు దాడి చేశాయి. ఈక్రమంలో కుక్కల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తడిసి ముద్దవుతున్న దివ్యాంగురాలు

కాజీపేట: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పాతకాలం నాటి పెంకుటిల్లు ఒక పక్కకు కూలిపోవడంతో ఇంటి నిండా వరదనీరు చేరడంతో ఓ దివ్యాంగురాలు తన ఇద్దరు పిల్లలతో తడిసి ముద్దవుతోంది. కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీకి చెందిన స్వరూప తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షానికి గోడలు కూలిపోవడంతో నిలువ నీడలేక నిరాశ్రయురాలిగా మారింది. అద్దె ఇంటిలో కిరాయికి ఉండే ఆర్థిక పరిస్థితి లేక పిల్లలతో కలిసి వానలోనే తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈమేరకు బాధిత కుటుంబాన్ని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగురాలి కుటుంబాన్ని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, దాతలు ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో వరద

విద్యారణ్యపురి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవరణలో తరగతి గదుల ఎదుట బుధవారం వరదనీరు నిలిచింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్న భోజనం వండేందుకు కార్మికులకు ఇక్కట్లు తప్పలేదు.

వరద నీరు వెళ్లేందుకు చర్యలు

ఖిలా వరంగల్: వర్షాల కారణంగా వరద నీరు వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వరంగల్ 17వ డివిజన్ ఆదర్శనగర్‌లో స్థానిక కార్పొరేటర్ గద్దె బాబుతో కలిసి బల్దియా అధికారులు బుధవారం పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండకుండా సాఫీగా ముందుకు వెళ్లేందుకు జేసీబీ సాయంతో కచ్చా డ్రెయినేజీను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోపగాని శంకర్, నిమ్మకాయల రాజు, షమీం, రావుల యాదగిరి, గండ్రాతి ప్రభాకర్, సాదిక్, ఎండీ.యాకూబ్ పాల్గొన్నారు.

శిథిలమైన ఇళ్ల కూల్చివేత

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరంగల్ 38వ డివిజన్ మధ్య, పడమర కోటలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అవినాష్, చైర్మన్ అన్వర్‌లతో కలిసి టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన ప్రమాదకరమైన పాత భవనాలు, పెంకుటిళ్లను గుర్తించారు. జేసీబీ సాయంతో కూల్చివేశారు. కార్యక్రమంలో రవీందర్, సారంగపాణి, చందర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి

ఖిలా వరంగల్ / కాశోజీ సెంటర్: బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ల్యాదెల్ల శరత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అధిక వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులు విష జ్వరాలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తలుపులు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 17మందిని కోర్టులో బుధవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, 15 మందికి రూ.28,400లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పు నిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ టారజాన్ చారి, బొంత మల్లయ్యకు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

యువకుడిపై ఈవ్‌టీజింగ్ కేసు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ కాలనీకి చెందిన కొప్పుల శ్రవ్యను 2021వ సంవత్సరం నుంచి వేధిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాధవపూర్ గ్రామానికి చెందిన శీలం రాకేష్‌పై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

బల్దియా జవాన్‌పై మటన్ వ్యాపారి దాడి



ఫిర్యాదు చేస్తున్న జవాన్ రవీందర్, కార్మికులు

ఖిలా వరంగల్ / వరంగల్ అర్బన్: రహదారులపై మేకలు, గొర్రెలను కోయటం ఏమిటని ప్రశ్నించిన బల్దియా జవాన్‌పై ఆగ్రహంతో దుర్భాషలాడుతూ మటన్ వ్యాపారి దాడి చేసిన సంఘటన వరంగల్ 33వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని శాంతినగర్‌లో బుధవారం జరిగింది. బాధిత జవాన్ కథనం ప్రకారం నగరపాలక సంస్థలో 33వ డివిజన్ జవాన్‌గా బైయిరి రవీందర్ విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్‌ఆర్‌ఆర్‌తోట, శాంతినగర్ రోడ్లపైన మేకలు, గొర్రెలను కోయటం నేరమని, పరిశుభ్రతను పాటించాలని సూచించినందుకు జవాన్ రవీందర్‌పై మటన్ షాపు వ్యాపారి టింల్‌కార్ ఉస్సేన్ దాడి చేసి జవాన్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్, కళ్లజోడును ధ్వంసం చేసి దుర్భాషలాడాడు. విధి నిర్వహణలో ఉన్న జవాన్‌పై దాడి చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం శిక్షించాలని కోరుతూ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కూరగాయల మార్కెట్ పరపతి సంఘం ఎన్నిక



డీసీఓను సన్మానిస్తున్న కమిటీ నాయకులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో నూతన పరపతి సంఘం ఏర్పాటు చేసుకోవడం వ్యాపారుల ఘన విజయమని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి అన్నారు. మార్కెట్‌లో కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు కోసం బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వందమంది ఒకే తాటిపైకి వచ్చిన పరపతి సంఘం ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగనారాయణ కోఆపరేటివ్ సొసైటీ గురించి పూర్తిగా వివరించి గొప్పగా ఎదగడానికి సభ్యులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం అధ్యక్షుడిగా బిట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అలీ, ఉపాధ్యక్షులుగా పాపని భాస్కర్, నమిండ్ల సూరయ్య, మురళి, కొండా హరితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా వెజిటేరియన్ 2కే రన్



హన్మకొండ చౌరస్తా: మాంసాహారం వద్దు శాకాహారమే ముద్దు అనే నినాదంతో హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు బుధవారం నిర్వహించిన బీపీ వెజిటేరియన్ 2కే రన్ ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం, పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జరిగిన సమావేశంలో శాకాహారంతో కలిగే ప్రయోజనాలపై పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో నగరంలోని పలు వాకర్స్ సంఘాల బాధ్యులు, యువత పాల్గొన్నారు.